క్లుప్తంగా

కిక్ బాక్సింగ్‌లో సుమంత్‌కు రజత పతకం



సుమంత్‌కుమార్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

రాజానగరం: అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల కిక్ బాక్సింగ్ పోటీల్లో పురుషుల విభాగంలో గైట్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి ఎ.సుమంత్‌కుమార్ రజత పతకాన్ని సాధించాడు. ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో ఇటీవల జరిగిన ఈ పోటీల్లో సుమంత్‌కుమార్ జేఎన్‌టీయూకే తరఫున పాల్గొని, ప్రతిభను చూపారని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ శేఖర్‌బాబు తెలిపారు. విద్యార్థి సుమంత్‌కుమార్‌ను అభినందించారు.

సర్పంచ్ కుటుంబానికి పరామర్శ



సర్పంచ్ రామకృష్ణను పరామర్శిస్తున్న జక్కంపూడి గణేష్

రాజానగరం: కుమార్తె మరణంతో బాధపడుతున్న సంపత్‌నగరం సర్పంచ్ పెంటగట్ల రామకృష్ణను, అతని కుటుంబ సభ్యులను వైఎస్సార్ సీపీ యువజన విభాగం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కో–ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ బుధవారం పరామర్శించారు. అనారోగ్యానికి గురైన రామకృష్ణ చిన్న కుమార్తె పద్మిని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించింది.

నూతన రథశాల ప్రారంభం



పుట్టకొండలో దాత కుటుంబీకులను సత్కరిస్తున్న సర్పంచ్ వెంకటరమణ

పెదపూడి: మండలంలోని పుట్టకొండలో ప్రసిద్ధి చెందిన లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద నిర్మించిన నూతన రథశాలను సర్పంచి వల్లు వెంకటరమణ బుధవారం ప్రారంభించారు. గండ్రేడు గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ బొప్పన రామ్మోహన్‌రాజు, వెంకటలక్ష్మి దంపతులు ఇచ్చిన రూ.10 లక్షల సాయంతో రథశాల నిర్మించారు. ఈ సందర్భంగా దాత కుటుంబీకులను ఆలయ ఈఓ సీహెచ్‌వీ రమణమూర్తి, ఆలయ ధర్మకర్త అనంతాచార్యులు తదితరులు దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మిరియాల శ్రీను, అర్చకులు గోపాలాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాల్లో పకడ్బందీ ఏర్పాట్లు



పోలింగ్‌బూత్ వద్ద ఏర్పాట్లపై చర్చిస్తున్న సీఐ శ్రీనివాస్, తహసీల్దార్ రాజ్‌కుమార్

పెదపూడి: రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి సమస్యాత్మక గ్రామాల్లో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కాకినాడ రూరల్ సీఐ శ్రీనివాస్ సూచించారు. బుధవారం మండలంలోని సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లను సీఐ శ్రీనివాస్, ఎస్ఐ శోభన్‌కుమార్, తహసీల్దార్ కె.రాజ్‌కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కమ్యూనిటీ హాలుకు శంకుస్థాపన



శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

మధురపూడి: కోరుకొండ మండలం గాదరాడలో బుధవారం అంబేడ్కర్ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది. వైఎస్సార్ సీపీ నాయకులు జయకర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కృషితో రూ.18 లక్షల నిధులు మంజూరైనట్టు తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కమ్యూటీహాలు తీరని సమస్యగా ఉందన్నారు. స్థానికుల కోరిక మేరకు ఎమ్మెల్యే నిధులు మంజూరు చేయడంపై కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు హరిబోలు చినబాబు, కల్యాణం రాంబాబు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి పరుగులు

- నియోజకవర్గంలో రోడ్లకు మహర్దశ
- రూ.223.57 కోట్లతో 170 కి.మీ. రోడ్ల నిర్మాణం
- మారుమూల గ్రామాలకు రహదారులు
- నాణ్యత ప్రమాణాలకు ప్రాధాన్యం



మిర్తిపాడు–బుచ్చింపేట మధ్య నిర్మిస్తున్న రోడ్డు



నిర్మాణ దశలో ఉన్న రాజమహేంద్రవరం–చినకొండేపూడి ఫోర్ లైన్ రోడ్డు

మధురపూడి: మెట్ట ప్రాంతమైన రాజానగరం నియోజకవర్గంలో రహదారుల నిర్మాణం జోరుగా సాగుతోంది. ఇప్పటికే పూర్తయిన రహదారులపై రాకపోకలు ఊపందుకున్నాయి. ప్రధాన రహదారులతో పాటు, మారుమూల గ్రామాలకు సైతం రోడ్ల నిర్మాణం జరుగుతుండడంతో గ్రామీణుల రవాణా అవసరాలు తీరుతున్నాయి.

నియోజకవర్గంలో కోరుకొండ, సీతానగరం, రాజానగరం మండలాల్లో రూ.223.57 కోట్లతో 37 పనుల ద్వారా 170 కి.మీ. మేర రోడ్ల నిర్మాణం జరుగుతోంది. వీటిలో ఎక్కువగా న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు (ఎన్‌డీబీ) ద్వారా నిర్మాణం జరిగింది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు 14 పనులు మంజూరు కాగా, వీటిలో మూడు పనులను రాజానగరం నియోజకవర్గానికి కేటాయించారు. ఈ పనులన్నీ వేగవంతంగా జరుగుతున్నాయి.

ఎన్‌డీబీ రహదారులివే..

రాజానగరం నుంచి పశ్చిమగానుగూడెం (వయా కలవచర్ల) వరకూ 10.05 కి.మీ. రహదారి నిర్మాణం జరిగింది. అలాగే కోరుకొండ నుంచి ముగ్గళ్ల వరకూ 14.40 కి.మీ. రోడ్డు నిర్మాణ దశలో ఉంది. సీతానగరం మండలం రాపాక నుంచి చినకొండేపూడి (వయా నాగంపల్లి) వరకూ 8.90 కి.మీ. రహదారి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజమహేంద్రవరం–చినకొండేపూడి 18.20 కి.మీ. నాలుగు వరుసల రహదారి నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి.

జాతీయ రహదారి పూర్తి

నియోజకవర్గంలో 516 జాతీయ రహదారిని నాణ్యత ప్రమాణాలతో నిర్మించారు. రాజమహేంద్రవరం నుంచి విజయనగరం వరకూ వెళ్లే ఈ రహదారి జిల్లాలో 43.70 కి.మీ. ఉంది. ఆ పనులన్నీ పూర్తయ్యాయి. అల్లూరి సీతారామరాజు జిల్లాలో ప్రస్తుతం పనులు జరుగుతున్నాయి. దీంతో రాజమహేంద్రవరం నుంచి అల్లూరి సీతారామరాజు జిల్లా ఐ.పోలవరం వరకూ వాహనాల రాకపోకలు జోరుగా సాగుతున్నాయి.

మరిన్ని సేవల్లో ఆర్అండ్‌బీ

రోడ్లు, భవనాల శాఖ రహదారుల నిర్మాణమే కాకుండా మరిన్ని సమాజ అవసరాలను తీరుస్తోంది. ఇందులో భాగంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో క్రీడా వికాస కేంద్రాలు, మల్టీ లెవెల్ స్టేడియం నిర్మాణాలతో పాటు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల భవన నిర్మాణాలూ చేపడుతోంది. మొత్తం రూ.6.36 కోట్లతో భవనాల నిర్మాణ పనులు జరుగుతున్నాయి.



బూరుగుపూడి జంక్షన్ నుంచి రాజానగరం రోడ్డు

మారుమూల గ్రామాలకూ రోడ్లు

నియోజకవర్గంలోని మారుమూల గ్రామాలకు రోడ్ల నిర్మాణం జరుగుతోంది. తొర్రేడు–మధురపూడి, మిర్తిపాడు–బుచ్చింపేట, బుచ్చింపేట–గాదరాడ (వయా జంబూపట్నం), నర్సాపురం–కణుపూరు, కోటికేశవరం–నాగంపల్లి, రాఘవపురం–కోరుకొండ వరకూ నిర్మాణాలు జరిగాయి. బూరుగుపూడి జంక్షన్ నుంచి రాజానగరం వరకూ పది కి.మీ. రోడ్డు నిర్మాణం పూర్తయింది. అలాగే రూ.35 కోట్లతో ఎస్సార్ వర్క్స్ (బ్యాంకు రుణాల ద్వారా) రోడ్డు, రూ.94 కోట్లతో ప్లాన్ వర్క్స్, రూ.66 కోట్లతో ఎన్‌డీడీ(న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు) పనులు, రూ.1.35 కోట్లతో గుడా వర్క్స్, రూ.15 కోట్లతో హై ఇన్‌ఫ్యాక్ట్ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

క్రీడా ప్రాంగణాలు సైతం..

సీతానగరంలో రూ.2.45 కోట్లతో క్రీడా వికాస కేంద్రం నిర్మాణం పూర్తయింది. దివాన్ చెరువులో రూ.4 కోట్లతో మల్టీ లెవెల్ స్టేడియం అడ్మినిస్ట్రేటివ్ ఉత్తర్వులు జారీ అయ్యాయి. కాగా టెండర్ల ప్రక్రియ కొనసాగుతోంది. ఇదే ఆర్అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో కోటికేశవరంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణం పూర్తయింది. బొబ్బిల్లంకలో రూ.2 కోట్లతో నిర్మాణం జరుగుతోంది.

అన్నింటా ముందున్నాం



నియోజకవర్గంలో రూ.223.57 కోట్ల నిధులతో 37 పనుల ద్వారా 170 కి.మీ. రోడ్ల నిర్మాణంతో పాటు, ఇతర భవన నిర్మాణాలు చేస్తున్నాం. నాణ్యత ప్రమాణాలే పరమావిధిగా పనులు నిర్వహిస్తున్నాం. సీతానగరంలో క్రీడా వికాస కేంద్ర నిర్మాణం జరిగింది. ఇటీవల ప్రారంభమై, యువతకు అందుబాటులోకి వచ్చింది. రాజానగరం మండలం దివాన్ చెరువులో మల్టీ లెవెల్ స్టేడియం నిర్మాణం టెండర్ల ప్రక్రియలో ఉంది. పీహెచ్‌సీల నిర్మాణం జరుగుతోంది.

– టీవీ మధుసూదనరావు, డీఈ, ఆర్అండ్‌బీ శాఖ

ఎమ్మెల్యే రాజా చొరవ



ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా చొరవతో రోడ్లు అధిక సంఖ్యలో మంజూరయ్యాయి. ఎన్‌డీబీ పనులు జిల్లాలోనే ఎక్కువగా సాధించడం మంచి విషయం. రాజమహేంద్రవరం–చినకొండేపూడి నాలుగు వరుసల రహదారి నిర్మాణం కీలకమైంది. క్రీడా వికాస కేంద్రాలు, ఓపెన్ జిమ్‌లతో యువతను ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దడం అభినందనీయం.

– వసుపులేటి బుల్లియ్యనాయుడు, కోరుకొండ

నారసింహుని కల్యాణోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



కల్యాణోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: కోరుకొండలో వెలసిన స్వయంభూ శ్రీలక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ బుధవారం జరిగింది. రాజమహేంద్రవరంలోని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా తన నివాసంలో ఈ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ ఈ నెల 19 నుంచి 25వ తేదీ వరకూ జరిగే ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. ఉత్సవాలకు లక్ష మంది భక్తులు రావచ్చని, అందుకనుగుణంగా ఏర్పాట్లు చేయాలని దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారులకు సూచించారు. ఈ నెల 20న స్వామివారి రథోత్సవం, రాత్రి జరిగే కల్యాణోత్సవాలు ప్రశాంతంగా జరగాలని ఆకాంక్షించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆధ్యాత్మిక భావంతో ఉత్సవాల్లో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకుడు తాడి హరిశ్చంద్రప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

రంగంపేట: మండలంలో పదో తరగతి పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు మండల విద్యాశాఖాధికారి కె.శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రంగంపేట, వడిశలేరు, సింగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఈ నెల 18 నుంచి 30వ తేదీ వరకూ పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జరుగుతాయన్నారు. రంగంపేట ఉన్నత పాఠశాల కేంద్రంలో 211, వడిశలేరు హైస్కూల్ నందు 197, సింగంపల్లి హైస్కూల్‌లో 198 మంది విద్యార్థులు పబ్లిక్ పరీక్షలు హాజరవుతారన్నారు. విద్యార్థులు ఒత్తిడికి లోను కాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి–2 పి.మధుసూదనరావు పాల్గొన్నారు.

జగనన్న పాలన సంక్షేమానికి చిరునామా

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సంక్షేమానికి చిరునామాగా నిలుస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కొమరిపాలెంలో గ్రాసిం ఇండస్ట్రీస్ సహకారంతో నిర్మించిన కమ్యూనిటీ హాలు, మంచినీటి శుద్ధి కేంద్రంతో పాటు ప్రభుత్వ నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగనన్న పొత్తు పార్టీలతో కాదని ప్రజలతోనేనన్నారు. ప్రతిపక్ష పార్టీలన్నీ పొత్తు పెట్టుకుని ఎన్నికల్లో పోటీకి దిగుతుంటే, జగనన్న మాత్రం సింగిల్‌గా వస్తున్నారని చెప్పారు. ప్రజలను నమ్ముకుని ఒంటరిగా పోరాడుతున్న జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు తమ సంపూర్ణ మద్దతు అందించాలని కోరారు. జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకుని సంక్షేమ పాలన కొనసాగించేలా ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ స్థాయి సంఘం చైర్‌పర్సన్ రొంగల పద్మావతి, సర్పంచ్ వాసంశెట్టి రవికుమార్, ఉపసర్పంచ్ కొవ్వూరి సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాల అందజేత

పెదపూడి: కుల, మత, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. బుధవారం ఆయన వేండ్రలో నూతనంగా నిర్మించిన సచివాలయం, కాపు కల్యాణ వేదిక ప్రారంభించడంతో పాటు కాపు నేత వంగవీటి మోహన్ రంగా విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను ప్రారంభించి ప్రజల ఇంటి ముంగిటకే ప్రభుత్వ పథకాలు అందజేస్తున్నారన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని కొనియాడారు. రోజురోజుకూ జగన్‌కు ప్రజల్లో ఆదరణ పెరుగుతుందన్నారు. ప్రజలంతా సీఎంగా జగనన్నను గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, సర్పంచ్ కోసూరి వాసు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కొల్లు పెద్దకాపు, మండల వ్యవసాయ రైతు సలహా మండలి చైర్మన్ నర్ల సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.



కొమరిపాలెంలో సీసీ రోడ్డు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

ప్రజలకు చేరువైన ప్రభుత్వ సేవలు

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- లక్ష్మీనరసాపురంలో అభివృద్ధి పనుల ప్రారంభం



అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: ప్రభుత్వం ప్రవేశపెట్టిన సచివాలయులు, ఆర్బీకే, వెల్‌నెస్ సెంటర్లతో ప్రభుత్వ పాలన, ప్రభుత్వ సేవలు ప్రజలకు చేరువయ్యాయని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని లక్ష్మీనరసాపురంలో సుమారు రూ.1.36 కోట్ల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ గ్రామాభ్యుదయానికి రాచబాటగా మారిందన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచడమే లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతిఒక్కరి ఇంటి ముంగిటకు చేరుతున్నాయన్నారు. అందుకే సంక్షేమ ప్రభుత్వంపై ప్రజలు పూర్తి సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. అదేవిధంగా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యమిస్తూ రోడ్లు, డ్రైనేజీలతో పాటు వివిధ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయడంతో గ్రామాలు ప్రగతి సాధిస్తున్నాయన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రతిపక్ష నాయకులు చెప్పే అబద్ధపు మాటలు నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచించారు. గత టీడీపీ పాలనకు, ప్రస్తుత వైఎస్సార్ సీపీ పాలనకు తేడాను గమనించి మంచి చేసిన ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని కోరారు. అంతకు ముందు గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవన సముదాయం, రూ.21.80 లక్షలతో నిర్మించిన ఆర్బీకే, రూ.23.38 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ వెల్‌నెస్ సెంటర్, రూ.9 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, డ్రైన్, జలజీవన్ మిషన్ పథకం ద్వారా రూ.41.64 లక్షల వ్యయంతో నిర్మించిన మంచినీటి పథకాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం గ్రామానికి చెందిన 25 మంది లబ్ధిదారులకు మంజూరైన ఇళ్ల పట్టాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. మండలంలోని మహేంద్రవాడలో జరిగిన కార్యక్రమంలో 203 మంది లబ్ధిదారులకు మంజూరైన ఇళ్ల పట్టాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచ్‌లు దాట్ల కిరణ్‌రాజు, మల్లిడి జయప్రభ గంగరాజు, ఎంపీటీసీ సురకాసుల శివ, సబ్బెళ్ల వెంకటరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు మంగిరెడ్డిగారి శ్రీను, తేతలి వెంకటరెడ్డి, జట్లారెడ్డిగారి అబ్బు, చంద్రగిరి వెంకటరమణ, శీలం శ్రీనివాస్, సీహెచ్ సత్యనారాయణ, వై.శివప్రకాష్, ఎం.సత్యనారాయణ, జి.మంగయమ్మ, ఎస్.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ల సంఘ భవనానికి శంకుస్థాపన



భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి

రాజానగరం: ఫొటోగ్రాఫర్ల సంఘ భవనం నిర్మాణానికి వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి బుధవారం రాజానగరంలో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ ఫొటోగ్రాఫర్ల సంక్షేమానికి అండగా నిలుస్తామన్నారు. ఫొటోగ్రాఫర్ల కోరిక మేరకు భవనం నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ దూలం పెద్ద, నాయకులు కుందేటి ప్రసాద్, కొల్లి వీర్రాజు, ప్రగడ చక్రి తదితరులు పాల్గొన్నారు.

సీతారాముల విగ్రహాల పునః ప్రతిష్ఠ



రామకోవెలలో ప్రతిష్ఠించిన సీతారామలక్ష్మణుల విగ్రహాలు

మధురపూడి: కోరుకొండ మండలం జంబూపట్నంలో సీతారామ, లక్ష్మణుల విగ్రహాల పునః ప్రతిష్ఠ కార్యక్రమం బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంతో పాత రామాలయం వద్ద ఆధ్యాత్మిక సందడి నెలకొంది. దాతలు చిట్టినీడి వెంకట్రావు, పాలూరి పెద్దరాజు ఈ విగ్రహాలను అందజేశారు. వేద పండితుల మంత్రోచ్ఛరణ నడుమ స్వామివార్లను ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉల్లి అప్పన్నదొర, వైఎస్సార్ సీపీ మాజీ మండల కన్వీనర్ ఉల్లి బుజ్జిబాబు, మాజీ ఎంపీటీసీ ఉల్లి చెల్లారావు, మాజీ సర్పంచ్ నాగా సత్తిబాబు, నాయకులు ఉల్లి గణ, తోరాట సత్యప్రసాద్, నాగా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక సీమంతాలు



సామూహిక సీమంతాలు నిర్వహించిన అంగన్‌వాడీ అధికారులు

రంగంపేట: పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా మండలంలోని సుభద్రంపేట గ్రామంలో బుధవారం అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కె.వాణి ఆధ్వర్యంలో సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన జెడ్పీటీసీ సభ్యుడు రాంబాబు మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకోవడం వల్ల తల్లుల్లో రక్తహీనత, పిల్లల్లో పోషకాహార లోపాన్ని నివారించవచ్చన్నారు. ఈ సందర్భంగా వాణి తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు గల ఆహారం వండే విధానం గురించి వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కూటి సాయితాతారావు, పంచాయితీ కార్యదర్శి మణికుమార్, వీఆర్‌ఓ డి.అబ్బులు, వెలుగు సీసీ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో వెలుగులు నిండాయి



పెదపూడిలో ఇంటింటా ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే సతీమణి ఆదిలక్ష్మి

పెదపూడి: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో నిరుపేదల జీవితాల్లో వెలుగులు నిండాయని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సతీమణి ఆదిలక్ష్మి అన్నారు. పెదపూడిలోని పాలచర్ల బ్రహ్మాజీ వీధిలో నూతనంగా ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీ పార్టీ కార్యాలయాన్ని బుధవారం ఆమె ప్రారంభించారు. ముందుగా స్థానిక మార్కెట్ సెంటర్‌లోని దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడ నుంచి ర్యాలీగా పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి గడపలోనూ ఆమెకు అపూర్వ స్వాగతం లభించింది. ఈ సందర్భంగా ఆదిలక్ష్మి మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి చూసి ప్రజలు ఫ్యాను గుర్తుకు ఓటు వేసి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా సూర్యనారాయణరెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు సమ్మంగి దుర్గా ప్రసాద్, పార్టీ చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శి పప్పు సింహాచలం, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ప్రతినిధులు కాకర సాయిబాబు, కోరా బాబి, గ్రామ కన్వీనర్ మీసాల నాగరాజు, మండల రైతు విభాగం కన్వీనర్ మార్ని వెంకట్రావు, గుంటూరు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ వచ్చేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే..



జి.మామిడాడలో పార్టీ నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: వైఎస్సార్ సీపీ శ్రేణులు సమరోత్సాహంతో పనిచేయాలని, మళ్లీ వచ్చేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. జి.మామిడాడ గ్రామంలోని ఫ్యామిలీ హెల్త్ క్లబ్ ఆవరణలో వైఎస్సార్ సీపీ మండల స్థాయి నాయకులు, కార్యకర్తల సమావేశం బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి, ఆయన సతీమణి ఆదిలక్ష్మి, రాజమహేంద్రవరం పార్లమెంటు అభ్యర్థి గూడూరి శ్రీనివాస్ సతీమణి రాధిక హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గెలవడం గ్యారంటీ అని, అయితే గతం కంటే భారీ మెజార్టీ సాధించడమే లక్ష్యంగా ముందుకు దూసుకుపోవాలన్నారు. అనపర్తి నియోజకవర్గంలో మన పార్టీ బలం చూసి ఇతర పార్టీలు భయపడుతున్నాయన్నారు. స్థానిక టీడీపీ ఎమ్మెల్యే టికెట్ త్రిశంకు స్వర్గంలో ఉందని, చంద్రబాబు బీజేపీకి ఇవ్వాలని ప్రయత్నం చేస్తుండగా, బీజేపీ వాళ్లు ఓడిపోయే సీటు మాకెందుకు అంటున్నారని ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో ప్రతి ఓటు మన పార్టీకే వచ్చేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అనపర్తి ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, మండల కన్వీనర్ గుత్తుల వెంకటరమణ, కె.సత్తిబాబు, చింతా దొరబాబు, సర్పంచుల సమాఖ్య నియోజకవర్గ అధ్యక్షుడు కొటికలపూడి చినబాబు, కోసూరి వాసు, సుందరపల్లి సుధాకర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ రథ సారథులు.. వలంటీర్లు

అనపర్తి: ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో అర్హులందరికీ అందజేస్తూ వలంటీర్లు కీలకపాత్ర పోషిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక తేతలి రామిరెడ్డి, మంగాయమ్మ కళావేదిక ప్రాంగణంలో అనపర్తి, బిక్కవోలు మండలాల పరిధిలో గల వలంటీర్లతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటుచేసిన వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని అన్నారు. తమ సేవల ద్వారా ప్రభుత్వానికి, ప్రజలకు వారధులుగా పనిచేస్తూ నిరుపమాన సేవలందిస్తున్నారన్నారు. వలంటీర్లకు తమ పరిధిలో 50 కుటుంబాల ప్రజలు అందించే గౌరవమే వారు గర్వపడేలా చేస్తోందన్నారు. ప్రజలకు నిస్వార్థ సేవలందిస్తున్న వలంటీర్ల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసే దిశగా ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటుందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ సోషల్ మీడియా ట్రోల్స్ కారణంగా ఆత్మహత్యకు పాల్పడిన గీతాంజలి మృతికి సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి సత్తి ఆదిలక్ష్మి, సర్పంచ్ వారా కుమారి, అనపర్తి ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, పోతుల ప్రసాద్‌రెడ్డి, చిర్ల వీర్రాఘవ రెడ్డి, శాప్ డైరెక్టర్ గుబ్బల అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.



జి.మామిడాడలో జరిగిన సమావేశానికి హాజరైన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

15 ఆలయాల నిర్మాణానికి రూ.1.50 కోట్ల మంజూరు

అనపర్తి: నియోజకవర్గంలోని అనపర్తి, బిక్కవోలు, పెదపూడి, రంగంపేట మండలాల పరిధిలోని 14 గ్రామాల్లో నూతనంగా నిర్మించే 15 ఆలయాలకు తిరుమల తిరుపతి దేవస్థానం నిధులు రూ.1.50 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి తెలిపారు. ఒక్కొక్క ఆలయ నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరైనట్లు ఆయన తెలిపారు.